క్లుప్తంగా

డ్రైవర్ల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్

కొవ్వూరు: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రమాదాలు చేసిన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు డిపో మేనేజర్ వైవీ వీఎన్ కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న తమ యాజమానిపై ఏవిధమైన ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చిరునవ్వుతో పంపించాలని సూచించారు. ప్రశాంతతతో డ్యూటీకి హాజరయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించు కోవడం మంచిదన్నారు. ప్రతీ మనిషి ఓర్పు, సహనంతో మంచి ఆలోచనలతో ఉంటే కుటుంబంతో పాటు సమాజంలో పనిచేసే సంస్థలు కుడా బాగుంటాయన్నారు. అనంతరం డ్రైవర్ల కుటుంబ సభ్యులకు స్వీట్లు, తాంబులం అందజేశారు.

తూర్పుచోడవరంలో చోరీ

నల్లజర్ల: తూర్పుచోడవరంలో ఇంటికి వేసి ఉన్న తాళాలు బద్దలు కొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని కసుకుర్తిమణి బుధవారం రాత్రి ఏడున్నర గంటలకు ఇంటికి తాళం వేసి సమీపంలో చర్చిలో జరుగుతున్న ప్రార్థనకు వెళ్లారు. తిరిగి పదిన్నర గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి చోరీ చేసినట్టు గుర్తించారు. ఇంట్లో బీరువాలో దాచుకున్న 5 కాసుల బంగారం, రూ.50 వేల నగదు పొలానికి సంబంధించిన కొన్ని పత్రాలు చోరీకి గురైనట్టు బాధితురాలు వాపోయింది. గురువారం ఉదయం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకట సురేష్ సిబ్బందితో వచ్చి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను హత్య చేసిన యువకుడి అరెస్టు

చాగల్లు: మహిళను హత్య చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు కొవ్వూరు రూరల్ సీఐ వైవీ రమణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు మండలంలోని చంద్రవరం గ్రామానికి చెందిన సింహాద్రి సుజాత(48) భర్త చనిపోయిన అనంతరం గత ఐదేళ్లుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. పెయింట్ పనులు చేసే అదే గ్రామానికి చెందిన యాదాల చైతన్యకుమార్ అలియాస్ నాని, సుజాత ఇంటికి పెయింట్ పనుల నిమిత్తం వెళ్లి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తరచుగా ఆమెకు ఫోన్ చేస్తున్నాడని, విషయాన్ని సుజాత తల్లిదండ్రులకు తెలిపింది. సుజాత తల్లిదండ్రులు నాని మందలించారు. అయితే సుజాత తనతో మాట్లాడంలేదనే కోపంతో ఈ నెల 22వ తేదీ తెల్లవారుజామున సుజాత ఇంటికి వెళ్లి మేడపై ఉన్నాడు. ఇది గమనించని సుజాత మేడపై బట్టలు ఆరేసేందుకు వెళ్లగా నాని కత్తితో సుజాతపై దాడి చేసి హత్య చేశాడు. దీంతో చైతన్యకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం నిడదవోలు రూరల్‌కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని కోరుతూ దశలవారీ పోరాటంలో భాగంగా గురువారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేసినట్టు ఆ సంఘం అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు తెలిపారు. 11వ పీఆర్‌సీలో 2922 జనవరి ఒకటి నుంచి తగ్గించిన అడిషనల్ క్వార్టర్‌ను తిరిగి యాథావిధిగా 70ఏళ్లు నిండిన వారందరికీ పది శాతం, 75 ఏళ్లు నిండిన వారందరికీ 15 శాతం చొప్పున పునరుద్దరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్ పరిధిని రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కోశాధికారి కె.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మొహీద్దీన్ భాషా, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు.

వనితమ్మను ఆశీర్వదించండి

- సమీకరణలో భాగంగానే వనిత, తలారిల మార్పు
- వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల: పుట్టింటికి వచ్చిన ఆనందం వనితమ్మలో కనిపిస్తోందని, ప్రజలు ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో ఆమెను అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ద్వారకాతిరుమలలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం, రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోపాలపురం, రాజానగరం ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారిలను పార్టీ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం సొంత నియోజకవర్గం కావడమే వనితమ్మ ధైర్యమని, ఆ ధైర్యమే ఆమె గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. సమీకరణాలు, పార్టీ నిర్ణయంలో భాగంగానే వనితను గోపాలపురానికి, తలారిని కొవ్వూరుకు పంపించామన్నారు. నియోజకవర్గం మారడం కొద్దిగా కష్టమైనా ఎంతో పెద్ద మనస్సుతో వీరిద్దరూ ఒప్పుకుని, పోటీ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నా, గత ఐదేళ్లుగా జరిగిన మంచి కార్యక్రమాలన్నీ కొనసాగాలన్నా మనమంతా విభేదాలను పక్కనబెట్టి కలసికట్టుగా పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఒక్కరూ గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా, బంగారు రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారన్నారు. కానీ జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అమ్మ ఒడి, ఆరోగ్య శ్రీ, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాల ద్వారా పేదలకు మేలు చేసిన ఘనత జగనన్నదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించిన పార్టీ నేతలను ఆయన అభినందించారు.

భారీ మెజారిటీతో గెలిపించండి



నా చెల్లెమ్మ వనితమ్మను నాకంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలి. 2014లో వనితమ్మకు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం వచ్చినప్పటికీ, తాను కొవ్వూరు వెళతానని, నా అన్న తలారికి గోపాలపురం కేటాయించాలని ఆమె చెప్పింది. ప్రస్తుతం ఈ రెండు సీట్లు గెలవాలన్న ఉద్దేశంతో పార్టీ అధిష్ఠానం ఈ మార్పు చేసింది.

– తలారి వెంకట్రావు, గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు ఇన్‌చార్జి

ప్రజల అవసరాలు తీరుస్తూ..



జగనన్న ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించి, ఆ దిశగా పాలన సాగిస్తున్నారు. వనితమ్మ, తలారిలను గెలిపించుకోవాలి.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

జగనన్న గెలుపే లక్ష్యం



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు జగనన్న గెలుపే లక్ష్యం కావాలి. కుప్పం సీటు కూడా గెలిచి చూపించాలనే లక్ష్యంతో మిథునన్న సారధ్యంలో మేము ముందుకెళ్తున్నాం. గోపాలపురంలో వనితమ్మ, కొవ్వూరులో తలారి వెంకట్రావుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలి.

– గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు

ఎంతో సంతోషం



నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తనకు పార్టీ శ్రేణులు సాదరంగా స్వాగతం పలకడం సంతోషానిచ్చింది. తలారిని కొవ్వూరులో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరం పార్టీ గెలుపునకు కృషి చేద్దాం.

– తానేటి వనిత, హోం శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి

అవినీతికి తావు లేదు



జగనన్న పాలనలో అవినీతికి తావు లేదు. గోపాలపురం నియోజకవర్గంలో తలారి వెంకట్రావు ఐదేళ్ల పాటు సమర్థవంతమైన పాలన అందించారు. అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉంటారు. వారిని గెలిపించాలి. ప్రజలకు అందుతున్న పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలి.

– జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు

గోదావరి జిల్లాల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

- వైఎస్సార్ సీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- కొవ్వూరులో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిచయ సభ



కొవ్వూరు పరిచయ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



కొవ్వూరు పరిచయ సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోనుందని ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రకటించారు. కొవ్వూరు యువరాజ్ ఫంక్షన్ హాలు గురువారం రాత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పరిచయ సభకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గర్వం అంటే తెలియని వ్యక్తి వెంకట్రావు అని, ఆయనకు అండగా ఉండాలని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలవబోతున్నామని సర్వేలు చెబుతున్నాయన్నారు. కొవ్వూరులో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. వచ్చే రెండు నెలల పాటు పార్టీ కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈనెల 30న ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం తరలిరావాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మీ ఆశీస్సులు వెంకట్రావుకు అందించాలని కోరారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ వచ్చిన తర్వాత అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని, రానున్న రోజుల్లో ప్రజా కోర్టులో ప్రజలే న్యాయమూర్తులుగా తీర్పు ఇస్తారని అన్నారు. కొన్ని మీడియా సంస్థలు ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నాయని, వాటిని పార్టీ శ్రేణులు సమర్థవంతంగా తిప్పికొట్టాల్సి అవసరం ఉందన్నారు. టీడీపీ ప్రజలను మోసం చేస్తే, వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజలకు అండగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమష్టిగా పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. హోమ్ మంత్రి వనిత మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో తనకు చూపించిన ఆధారాభిమానాలు అన్న తలారి వెంకట్రావుపై చూపించాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరు నాయకుల్ని సమన్వయం చేసుకుంటూ మీ అందరి వాడిగా నిత్యం అందుబాటులో ఉంటానని, పార్టీ కోసం అందరం కృషి చేద్దామన్నారు. కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, గోపాల పురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కూడా మాట్లాడారు. ముందుగా మెరకవీధిలో వైఎస్సార్, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం పార్టీ నాయకులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. మిథున్‌రెడ్డిని గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కొవ్వూరు మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, నాయకులు గారపాటి శ్రీనివాస రావు, ఉప్పులూరి సూరిబాబు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గుడా విజయరాజు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడ చొటు పల్లి వీరన్న, పార్టీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.దొరయ్య పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శిక్షణ



అనంతపల్లిలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సబ్‌రిజిస్ట్రార్ రాఘువేంద్రప్రసాద్

నల్లజర్ల: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. సచివాలయాల ద్వారే ఈ కార్యక్రమం నిర్వహించడానికి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ రాఘువేంద్రప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్ తమ వద్ద ఉన్న జాబితాలో లబ్ధిదారుని పేరు సూచిస్తారని, దానికి వీఆర్వో సరిహద్దులు చెబుతారని, కార్యదర్శి ముగ్గురు సంతకాలు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. గతంలో ఇళ్లపట్టాలు పంపిణీ చేసినా వాటిపై పేదలకు హక్కులు దక్కేవి కాదని, డీ పట్టాలు కావడంతో అనుభవించడం మినహా వాటిపై సర్వహక్కులు ఉండేవి కాదని, అందుకే ఇళ్లపట్టాలు పొందిన పదేళ్లకు వాటిపై లబ్ధిదారులకు సర్వహక్కులు పొందేలా ప్రస్తుత ప్రభుత్వం అసైన్డు భూముల సవరించిందన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి యజమానులకు కన్వేయన్స్ డీడ్‌లు అందించనున్నారు. సచివాలయాలను జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గురుకులంలో అడ్మిషన్లు

గోపాలపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి 2024–2025 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేసినట్లు గోపాలపురం పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం నుంచి మార్చి పదో తేదీ వరకూ అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి పదో తేదీన ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం అధికారులు, ఆయా పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని జగనన్నకు గిఫ్టుగా ఇస్తాం

- హోం మంత్రి తానేటి వనిత
- యర్నగూడెంలో క్యాంపు కార్యాలయం ప్రారంభం



యర్నగూడెం క్యాంపు కార్యాలయంలో గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న తానేటి వనిత

దేవరపల్లి: సమన్వయంతో పనిచేసి రాబోవు ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని రాష్ట్ర హోం మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఏర్పాటు చేసిన నూతన క్యాంపు కార్యాలయాన్ని గురువారం మంత్రి తానేటి వనిత, ఆమె తండ్రి మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తానేటి వనిత మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినట్టు ఆమె తెలిపారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేయడం వల్ల చాలా మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయాలు ఉన్నాయని, కొత్త వారిని కూడా కలుపుకుని గ్రామస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. దాదాపు 10 సంవత్సరాల అనంతరం తన పుట్టిల్లు గోపాలపురం నియోజకవర్గం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ ఆడపడుచుగా నియోజకవర్గ ప్రజలు ఆదరించి అపూర్వ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. తొలుత క్యాంపు కార్యాలయం వద్ద సర్వమత ప్రార్థనల్లో మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంత్రి వనిత పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించారు.

వనితమ్మకు అపూర్వస్వాగతం

రాష్ట్ర హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి తానేటి వనితకు దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పుట్టింట అపూర్వస్వాగతం లభించింది. నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మంత్రి తానేటి వనిత గురువారం దేవరపల్లి మండలం యర్నగూడెం రావడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. దారిపొడవున అభిమానులు, పార్టీ శ్రేణులు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉదయం 11 గంటలకు సుమారు 200 కార్లతో భారీ ర్యాలీగా ద్వారకాతిరుమల బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, రాష్ట్ర ఆయిల్ పామ్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, గోపాలపురం మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు, నల్లజర్ల మండల అధ్యక్షులు గగ్గర శ్రీనివాస్, నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కొవ్వూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చాగల్లు: మండలంలోని ఊనగట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతికి చెందిన 68 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను గ్రామ సర్పంచ్ ఎం.వెంకట్రావు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని వెంకట్రావు అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపిచంద్, నాయకులు పుల్లూరి వెంకటేశ్వరరావు, ఎం.శివ, బుజ్జిబాబు, హెచ్ఎం ఎన్‌వీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి పర్యటన

కొవ్వూరు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు బస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. 10.30 గంటలకు కుమారదేవం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం, సాయంత్రం నాలుగు గంటలకు చాగల్లు మండలం కలవలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం



తాళ్లపూడి సచివాలయం వద్ద సీనియర్ సిటిజన్లకు సత్కారం

తాళ్లపూడి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడం మన ప్రాథమిక హక్కని, ప్రతి పౌరుడు ఓటును విధిగా కలిగి ఉండాలని ఎంపీడీవో టీబీ వెంకట రమణ పేర్కొన్నారు. గురువారం మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో కరిబండి విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తాళ్లపూడి బస్టాండ్ నుండి మెయిన్ రోడ్‌లో విక్టరీ బజార్ వరకూ జరిగిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణ, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, డిప్యూటీ తహసీల్దార్ భారతి, రెవెన్యూ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కొర్డినేటర్ డి.మాధవరావు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాల వద్ద సీనియర్ ఓటర్లను శాలువాతో సత్కరించారు.

నిడదవోలు రూరల్: ప్రజలు నిజాయతీతో ఓటు హక్కు వినియోగించి ప్రజాస్వామ్య విలువను కాపాడాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.శామ్యూల్, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ దాన్ని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి ఎం.ఝాన్సీరాణి సూచించారు. నిడదవోలు మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందాలని సూచించారు. సీనియర్ ఓటర్లను సన్మానించి, ఓటు హక్కు ప్రాధాన్యతపై వివరించారు. తహసీల్దార్ ఎం.గంగరాజు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

